సాక్షి
మంచిర్యాల
బుధవారం, 15, నవంబర్, 2023



ఎన్నికల ప్రక్రియలో వీరే కీలకం

ఎన్నికల నిర్వహణలో బీఎల్వో నుంచి జిల్లా ఎన్నికలాధికారి దాకా అందరూ కీలకమే. ఓటరు జాబితా తయారీ నుంచి ఎన్నికల ఫలితాల వరకు శ్రమించాల్సిందే.. 10లో▸



ఘనంగా బాలల దినోత్సవం

నెహ్రూ జయంతిని పురస్కరించుకుని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలు బోధించారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్ల బడుతుంది. రాత్రివేళ చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



దండేపల్లి కేంద్రాన్ని పరిశీలిస్తున్న దత్త

దండేపల్లి: మండలంలోని దండేపల్లి, కుందేల్ పహాడ్ పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు బిస్వజిత్ దత్త మంగళవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు పరిశీలించారు. గూడెం అటవీ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల తనిఖీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్సై ప్రసాద్, లైజన్ ఆఫీసర్ దినేశ్, ఆర్ఐ భూమన్న ఉన్నారు.

శోభాయమానం.. ఆకాశదీపం



ఆకాశదీపం వెలిగిస్తున్న అర్చకులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి ఆలయంలో మంగళవారం శోభాయమానంగా ఆకాశదీపం ప్రారంభమైంది. ఆలయ ఈవో ముక్తారవి, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభానికి తాడుతో దీపాన్ని అమర్చారు. చిన్న చిన్న రంధ్రాలు చేసిన గుండ్రని ఇత్తడి పాత్రలో నూనెపోసి దీపాన్ని వెలిగించారు. ఆకాశ దీపం దర్శించుకుంటే అనంత పుణ్యఫలం లభిస్తుందని అర్చకులు తెలిపారు. అర్చకులు నరహరిశర్మ, బాలకృష్ణ, భట్టాచార్యులు, రెనోవేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధనం మూలం..!

ఓ పార్టీ అభ్యర్థి మందమర్రి మండలం ఊరు రామకృష్ణాపూర్‌లో తన బలం పెంచుకునేందుకు 30 మందికోసం రూ.2లక్షలు ఖర్చు చేశాడు. దీంతో ఆ అభ్యర్థికే వారు జై కొట్టడం ప్రారంభించారు. పార్టీ కండువాలు కప్పుకొని రోజువారీగా ప్రచారం చేస్తున్నారు. ఓ వాడలో 30 మందిని మాత్రమే తనవైపు తిప్పుకొనేందుకే సదరు అభ్యర్థి అక్షరాల రూ.2లక్షలు ఖర్చు చేయడం విశేషం.

ఇదీ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓ అభ్యర్థి చేసే ఎన్నికల ఖర్చుకు చిన్న ఉదాహరణ.



- మరింత ఖరీదైన అసెంబ్లీ ఎన్నికలు
- చెన్నూరు, బెల్లంపల్లిలో పోటాపోటీ
- రిజర్వ్‌డ్ స్థానాల్లో డబ్బు ప్రవాహం
- ఇతర పార్టీల నాయకుల కొనుగోళ్లు
- వ్యయపరిశీలకుల దృష్టి పడాల్సిందే..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికలు గతంలో ఎన్నడూ లేనంతగా అత్యంత ఖరీదుగా మారాయి. జిల్లా పరిధిలో నాలుగు అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇందులో మంచిర్యాల జనరల్, బెల్లంపల్లి, చెన్నూరు ఎస్సీ, ఖానాపూర్ (జన్నారం) ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలుగా ఉన్నాయి. సాధారణంగా జనరల్ స్థానంలో బలమైన నాయకులు పోటీలో ఉంటే అధికంగా డబ్బు ఖర్చు చేస్తుంటారు. అయితే ఈసారి ఇందుకు భిన్నంగా జనరల్ స్థానం కన్నా బెల్లంపల్లి, చెన్నూరు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లోనూ విచ్చలవిడిగా డబ్బు ప్రవాహం పెరిగింది. పోటీలో ఉన్నవారు ఎలాగైనా ఎమ్మెల్యేగా గెలవాలనే లక్ష్యంతో ముందుకెళ్తుండగా ఎన్నికలు చాలా ఖరీదవుతున్నాయి. ధనబలమున్న గడ్డం సోదరులైన మాజీ మంత్రి వినోద్, మాజీ ఎంపీ వివేక్ రంగ ప్రవేశంతో ఎన్నికలు మరింత ప్రియమైపోయాయి.

బీఆర్ఎస్ బలం తగ్గకుండా..

చెన్నూర్, బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థులైన గడ్డం సోదరులకు దీటుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య ఖర్చు చేయడంలో పోటీ పడుతున్నారు. ప్రచారం, నాయకులు, కార్యకర్తల చేరికలు, బహిరంగసభలు, సమావేశాలు, ర్యాలీలు కార్యక్రమాలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఇటీవల సీఎం కేసీఆర్ బహిరంగసభలు విజయవంతం చేసేందుకు రూ.కోట్లు వెచ్చించాల్సి వచ్చింది. దీంతో అధికార పార్టీ అభ్యర్థులకూ ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ప్రతిరోజూ ప్రత్యర్థులకు ఏ మాత్రం తగ్గకుండా కార్యక్రమాలు చేయడమో.. అంతకంటే భారీగా ప్లాన్ చేయడం కోసమో నోట్ల కట్టలు విప్పాల్సి వస్తోంది. మంచిర్యాల నియోజకవర్గం కంటే ఈ రెండు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల ఖర్చు పోటాపోటీగా నడుస్తోంది.

బీజేపీ అభ్యర్థుల హైరానా

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నికల్లో ఓట్లు రాల్చేందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే బీజేపీ అభ్యర్థులు హైరానా పడుతున్నారు. చెన్నూరు టికెట్ తెచ్చుకున్న దుర్గం అశోక్, బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ఆ రెండు పార్టీలతో డబ్బుల్లో పోటీపడలేకపోతున్నారు. అయినప్పటికీ తమ స్థాయికి మించి ఖర్చు చేసేందుకు వెనుకాడడం లేదు. పోటీలో ఎక్కడ వెనుకబడిపోతామనే భయంతో చేతి చమురు వదులుకోవాల్సి వస్తోంది. ఇక బీఎస్పీ, స్వతంత్రులుగా పోటీ చేస్తున్నవారైతే ఈ ఖర్చు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. పోటీ పడలేక, పోటీ నుంచి తప్పుకోలేక ఇబ్బందిగానే ముందుకు సాగుతున్నారు.

రోజుకు రూ.లక్షల్లోనే ఖర్చు

తెల్లవారు మొదలు పొద్దుగుంకేదాకా ప్రచారమంతా ఖర్చుతోనే నడుస్తోంది. ర్యాలీలు, బహిరంగ సభలకు జనసమీకరణ, రవాణా, భోజనాలు, మద్యం, ఊరూరా ప్రచార రథాలు, ప్రకటనలు, కరపత్రాలు, కండువాలు, బహిరంగ సభలు, వసతులు తదితర వాటి కోసం రూ.లక్షల్లోనే ఖర్చవుతోంది. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతీ అభ్యర్థి రూ.40లక్షల్లోపే ఖర్చు పరిమితి ఉంది. అయితే ఆ పరిమితి వాస్తవానికి ఎప్పుడో దాటిపోయింది. ఇతర పార్టీల నాయకులు తాము పార్టీ మారేందుకు 'బేరసారాలు' మొదలుపెట్టాక ఈ ఖర్చు మరింత పెరిగిపోయింది. నామినేషన్ల ఉపసంహరణలోనూ డబ్బు ప్రవావం ఉంటోంది. ఇక పోలింగ్ సమీపించే కొద్దీ ఈ నోట్ల ప్రవాహం మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు అభ్యర్థుల ఖర్చుపై పకడ్బందీ నిఘా పెడితే ఎన్నికల్లో డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట పడనుంది.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు బిశ్వజిత్ దత్త

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు బిశ్వజిత్ దత్త సూచించారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీ సంతోష్, బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి రాహుల్, జిల్లా అటవీశాఖ అధికారి ఆశిష్‌సింగ్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకుడు బిశ్వజిత్ దత్త మాట్లాడుతూ.. నోడల్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టే నగదు, మద్యం, కానుకలు ఇతరత్రా అంశాల రవాణా జరగకుండా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్త, సజ్జన్ ఆర్ సూచించారు. హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్, డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ స్వామిరాజ్‌తో కలిసి పరిశీలించారు. బందోబస్తు, ఈవీఎం, వీవీప్యాట్‌లను భద్రపర్చడం, సీలింగ్, లెక్కింపు కేంద్రంలో చేపట్టాల్సిన అంశాలపై సూచనలు చేశారు.



లెక్కింపు కేంద్రం చుట్టూ ఏర్పాటు చేసే ఫెన్సింగ్ పరిశీలిస్తున్న దత్త, సజ్జన్ ఆర్, సంతోష్

ఖర్చుల లెక్కింపు వేగవంతం చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: దినపత్రికలు, కేబుల్ ఛానళ్లు, సోషల్ మీడియోలో ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌లను గుర్తించి లెక్కించడంతోపాటు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్త, సజ్జన్ ఆర్ సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్, సోషల్ మీడియా సెల్, వీడియో పరిశీలన గదులను పరిశీలించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, జిల్లా పౌరసంబంధాల అధికారి వై.సంపత్‌కుమార్, నోడల్ అధికారి వినీత, సోషల్ మీడియా సెల్ సూపర్‌వైజర్, ఈడీఎం సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్‌లో నాలుగు నామినేషన్ల ఉపసంహరణ



నామినేషన్ ఉపసంహరించుకుంటున్న అభ్యర్థి

చెన్నూర్: చెన్నూర్ అసెంబ్లీ స్థానానికి నామినేషన్లు వేసినవారిలో నలుగురు మంగళవారం ఉపసంహరించుకున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సిడాం దత్తు తెలిపారు. ఈ స్థానానికి 30 మంది నామినేషన్లు వేయగా వివిధ కారణాలతో ఆరు తిరస్కరణకు గురైనట్లు పేర్కొన్నారు. మిగతా 24మందిలో నలుగురు ఉపసంహరించుకోగా 20మంది బరిలో ఉన్నట్లు తెలిపారు.



ఉపసంహరణ పత్రాన్ని ఆర్వోకు ఇస్తున్న రమేశ్

బెల్లంపల్లిలో ఒకటి..

బెల్లంపల్లి: బెల్లంపల్లి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన గంధం రమేశ్ మంగళవారం పోటీ నుంచి తప్పుకొన్నారు. 25మంది నామినేషన్లు వేయగా, ఇందులో వివిధ కారణాలతో తొమ్మిది మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఒక స్వతంత్ర అభ్యర్థి ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీ రాహుల్ ప్రకటించారు.

డిజిటల్ పాఠాలు

- బోధనకు నూతన హంగులు
- 47 స్కూళ్లకు 320 కంప్యూటర్లు
- 14 ఎమ్మార్సీలకు మరో 84..
- సర్కార్ స్కూళ్ల బలోపేతానికి.. తెలంగాణ విద్యాశాఖ చర్యలు

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల్లో పాఠ్యాంశాల బోధనకు ప్రభుత్వం నూతన హంగులు జోడిస్తోంది. విద్యాప్రమాణాల పెంపునకు మరింత కృషి చేస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థులకు డిజిటల్ బోధన మరింత చేరువయ్యేలా విద్యాశాఖ నడుం బిగించింది. దశలవారీగా జిల్లాలో 528 పాఠశాలలకు 533 ట్యాబ్‌లు, 77 డిజిటల్ తెరలు అందించింది. కంప్యూటర్లు కూడా అందించేందుకు ఆదేశాలు జారీ చేసింది. కేజీబీవీలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ అందించారు. ఇంతవరకు కంప్యూటర్లు లేని 47 ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా కంప్యూటర్లు ఇవ్వనున్నారు. పూర్వ మండలాలకు సంబంధించి 14 ఎమ్మార్సీల కార్యాలయాలకు ఆరు కంప్యూటర్లు, ఒక ప్రింటర్, యూపీఎస్, కంప్యూటర్ ఫర్నిచర్ అందించనున్నారు. 47 పాఠశాలలకు 320 కంప్యూటర్లు, 14 ఎమ్మార్సీలకు ఆరు చొప్పున మొత్తం 84 కంప్యూటర్ల పంపిణీకి చర్యలు వేగవంతం చేశారు.

పీజీఐ-డీ కొలమానంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు తిరోగమనం దిశగా సాగుతున్నాయని పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ఫర్ డిస్ట్రిక్ట్ (పీజీఐ–డీ) స్పష్టం చేస్తోంది. పాఠశాల విద్యావ్యవస్థలో జిల్లాల వారీగా పనితీరు అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పీజీఐ–డీ విడుదల చేస్తోంది. 2021–222 విద్యాసంవత్సరానికి సంబంధించిన నివేదికతో జిల్లా వెనుకబడినట్లు తెలుస్తోంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, గదుల్లో ప్రభావవంతమైన కార్యకలాపాలు, మౌలిక వసతులు, పాఠశాల భద్రత, విద్యార్థుల రక్షణ, డిజిటల్ విద్యాభ్యాసం, పరిపాలన తదితర అంశాల్లో పీజీఐ–డీని కొలమానంగా తీసుకుంటారు. ప్రతిభ చాటిన పాఠశాలలకు దక్ష, అత్యుత్తమ, ఉత్తమంగా గ్రేడింగ్ ఇస్తారు. డిజిటలైజేషన్ బలోపేతం దిశగా కంప్యూటర్ పరికరాలు అందించాలని విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

డిజిటల్ తెరలపై పాఠాలు..

జిల్లాలో దృశ్య రూపంలో పాఠాలు చెబితే పిల్లలకు విషయాలు ఎంతో అర్థమవుతాయనే ఉద్దేశంతో డిజిటల్ బోధన చేస్తోంది. బ్లాక్‌బోర్డుల స్థానంలో గ్రీన్ చాక్‌బోర్డులతో 77 పాఠశాలల్లో డిజిటల్ తెర పద్ధతిలో బోధన చేసేందుకు అవసరమైన పరికరాలు సమకూర్చారు. 75 ఇంచులు కలిగిన మానిటర్లు, మెటల్ ఫ్రేమ్‌తో కూడిన గ్రీన్ చాక్ బోర్డు మానిటర్ (మూసివేస్తే గ్రీన్ చాక్‌బోర్డుగా.. తెరిస్తే దృశ్య బోధన మానిటర్‌గా) ఉపయోగించుకోవచ్చు. టచ్ స్క్రీన్ సదుపాయం కూడా ఉంది. ఈనేపథ్యంలో ఇదివరకు అందించని 47 పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా 320 కంప్యూటర్లు అందించనున్నారు.

47 పాఠశాలలు ఇవే..

జిల్లాలో 47 పాఠశాలలకు కంప్యూటర్లు అందించనున్నారు. జెడ్పీహెచ్ఎస్ (చాకెపల్లి), కేజీబీవీ (బెల్లంపల్లి), జెడ్పీహెచ్ఎస్ (వీజ్‌గాన్), కేజీబీవీ (భీమిని), కేజీబీవీ (భీమారం), జెడ్పీహెచ్ఎస్ (ఎన్‌పీ వాడ, చెన్నూర్), జెడ్పీహెచ్ఎస్ (సుద్దాల), జెడ్పీహెచ్ఎస్ (పొక్కూర్), జెడ్పీహెచ్ఎస్ (దుగ్నేపల్లి), జెడ్పీహెచ్ఎస్ (కొమ్మెర), కేజీబీవీ (చెన్నూర్), జెడ్పీహెచ్ఎస్ (మామిడిపల్లి), జెడ్పీహెచ్ఎస్ (గుడిరేవు), జెడ్పీహెచ్ఎస్ (గూడెం), జెడ్పీహెచ్ఎస్ (కోర్విచెల్ల), జెడ్పీహెచ్ఎస్ (వెల్గనూర్), టీఎస్ఎంఎస్ (లింగాపూర్, దండేపల్లి), కేజీబీవీ (దండేపల్లి), జెడ్పీహెచ్ఎస్ (రాపల్లి), జెడ్పీహెచ్ఎస్ (షెట్‌పల్లి), జెడ్పీహెచ్ఎస్ (కవ్వాల్), జెడ్పీహెచ్ఎస్ (మురిమడుగు), జెడ్పీహెచ్ఎస్ (కామన్‌పల్లి), జెడ్పీహెచ్ఎస్ (ఇంధన్‌పల్లి), కేజీబీవీ (జన్నారం), జెడ్పీహెచ్ఎస్ (జన్కాపూర్), జెడ్పీహెచ్ఎస్ (బోగూడ గూడెం), జెడ్పీహెచ్ఎస్ (ముత్యంపల్లి), జెడ్పీహెచ్ఎస్ (సిర్సా), జెడ్పీహెచ్ఎస్ (పారిపల్లి), జెడ్పీహెచ్ఎస్ (అన్నారం), టీఎస్ఎంఎస్ (కోటపల్లి), జెడ్పీహెచ్ఎస్ (వెంకట్రావ్‌పేట్), జెడ్పీహెచ్ఎస్ (ఇటక్యాల), జెడ్పీహెచ్ఎస్ (లక్ష్మీపూర్), కేజీబీవీ (లక్సెట్టిపేట), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సినిమావాడ, మంచిర్యాల), కేజీబీవీ (మంచిర్యాల), జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ మందమర్రి (ఒర్రెగడ్డ), కేజీబీవీ (మందమర్రి), జెడ్పీహెచ్ఎస్ (నస్పూర్), జెడ్పీహెచ్ఎస్ (మైలారం), కేజీబీవీ (తాండూర్), కేజీబీవీ (నెన్నెల), జెడ్పీహెచ్ఎస్ (వేమనపల్లి), కేజీబీవీ (వేమనపల్లి).

విద్యార్థులు వినియోగించుకోవాలి



ప్రభుత్వ పాఠశాలలను డిజిటలైజేషన్‌లో బలోపేతం చేయడంలో భాగంగా ప్రాథమిక, ప్రాథకోన్నత పాఠశాలలకు ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఇచ్చింది. కంప్యూటర్లు అసలే లేని 47 పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా కంప్యూటర్లు ఇవ్వనుంది. కంప్యూటర్లు, రెండు గంటల బ్యాకప్ కలిగిన యూపీఎస్, 14 పాత మండలాలకు ఎనిమిది కంప్యూటర్ల చొప్పున త్వరలోనే అందించనుంది. మండలాలు, పాఠశాలలు డిజిటలైజేషన్ చేస్తూ పర్ఫామెన్స్ గైడ్ ఇండికేటర్‌లో జిల్లా స్కోర్ పెంచనున్నారు. డీఈవో యాదయ్య సూచన మేరకు ఈ వసతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు వినియోగించుకుని బోధన అభ్యసన ఉన్నతంగా సాగేందుకు చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాస్, సెక్టోరల్ అధికారి, మంచిర్యాల

ఏపీలో 'బీసీ జనగణన'పై హర్షం

- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం
- ఆకాంక్ష నెరవేర్చుతున్నారని ప్రశంసలు

పాతమంచిర్యాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీల ఆకాంక్ష నెరవేర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీ జనగణన చేపట్టడం శుభపరిణామమని బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మంగళవారం ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 27నుంచి బీసీ కులగణన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా గత పాలకులు బీసీ జనగణన చేపట్టకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దేశంలో మొదటిసారి బిహార్ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టిందని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ జనగణన చేపట్టడం హర్షణీయమని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీల కల సాకారం కానుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ఎన్నికల తర్వాత ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టి బీసీల ఆకాంక్ష నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీపతి రాములు, ఆరెందుల రాజేశం, చంద్రగిరి చంద్రమౌళి, నార్ల మహేందర్, గగ్గూరి రాజన్న, సతీశ్ పాల్గొన్నారు.



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్/బెల్లంపల్లి: ఎన్నికల విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీ సంతోష్ హెచ్చరించారు. మంగళవారం మంచిర్యాల, బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లో రికార్డులు, రిజిష్టర్లు, ఎన్నికల సామగ్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటు విలువ, ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీపై కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగి సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని పేర్కొన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాములు, నోడల్ అధికారి నీరటి రాజేశ్వరి, మంచిర్యాల, దండేపల్లి, నస్పూర్, బెల్లంపల్లి తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్

విద్య, ఉద్యోగం, ఉపాధి, అభివృద్ధి

- ఎన్నికల్లో వీటిపైనే యువత దృష్టి
- జిల్లాలో 6,41,425 మంది ఓటర్లు
- 18–39 ఏళ్లవారు 3,25,953 మంది
- సగానికి పైగా ఓట్లు యువతరానివే..
- అసెంబ్లీ ఎన్నికల్లో వీరి తీర్పే కీలకం

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో వయస్సుల వారీగా ఓటర్ల వివరాలు

వయస్సు	మంచిర్యాల	బెల్లంపల్లి	చెన్నూరు
18–19 ఏళ్లు	7,906	5,356	6,090
20–29ఏళ్లు	56,233	36,260	38,865
30–39 ఏళ్లు	75,737	50,310	49,196
40–49 ఏళ్లు	53,148	32,899	36,487
50–59 ఏళ్లు	42,371	23,841	28,440
60–69 ఏళ్లు	25,465	15,208	18,252
70–79 ఏళ్లు	10,844	7,357	8,515
80నుంచి ఆపైన..	3,103	2,104	2,438
మొత్తం	2,74,807	1,78,335	1,88,283



యువనాడి

మంచిర్యాలటౌన్: ప్రస్తుత కాలంలో నేతలు చెప్పే మాటల కంటే, వారి చేతలు ఏ మేరకు ఉంటాయనే దానిపైనే యువత ఆలోచిస్తోంది. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందన్నది మన నేతల మాటలు. ఈ మాటలు త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అక్షర సత్యం కానున్నాయి. ఇప్పటికే జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో యువ ఓటర్ల సంఖ్య గతం కంటే బాగా పెరిగింది. ప్రస్తుతం మూడు నియోజకవర్గ అభ్యర్థుల భవిష్యత్ యువత చేతిలోనే ఉంది. వారు ఎటువైపు మొగ్గితే అటే విజయావకాశం ఉంది. పలు రాజకీయ పార్టీలు చెప్పే మాటలు, హామీలను ఆచీతూచి గమనిస్తూ ఏ నాయకుడిని ఎన్నుకోవాలి.. ఏ పార్టీని గెలిపిస్తే యువతకు పూర్తిస్థాయిలో విద్య, ఉద్యోగం, ఉపాధి, అభివృద్ధి జరుగుతుందనే దానిపైనే పూర్తిగా దృష్టిసారిస్తున్నారు. దీంతో అన్ని పార్టీలు ప్రస్తుతం యువతను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. స్థానికంగా పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులు యువతను ఆకట్టుకునేందుకు పలు తాయిలాలను అందించేందుకు ముందుకు వస్తున్నా.. తమకు విద్య, ఉపాధి, అభివృద్ధి మాత్రమే కావాలని, వీటిని అందించలేని వారు తమకు అక్కర్లేదనే అభిప్రాయాన్ని యువత వ్యక్తం చేస్తున్నారు. వారిలో కొందరి అభిప్రాయాలు వారి మాటల్లో..

రోడ్డు సౌకర్యం కల్పించాలి



జిల్లాలోని అన్ని మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచాలి. రహదారులు, వాగులపై వంతెనలు నిర్మించాలి. అప్పుడే రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వీలవుతుంది. పల్లెలు, పట్టణాలు ఒకేలా ఉండేలా సమానస్థాయిలో అభివృద్ధి చేయాలి.

– ఏ మానస, కోటపల్లి


ఏటా ఉద్యోగాలివ్వాలి



ఏటా వేలాదిమంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. కోచింగ్‌కు వెళ్లి, ఉద్యోగాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. అలా కాకుండా ఏటా ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలి. దీంతో నిరుద్యోగులు ఒక అంచనాతో చదువుకుంటారు.

– బీ మనీషా, మంచిర్యాల

హాస్టళ్లు మెరుగుపర్చాలి



జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలను మెరుగుపర్చాలి. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వ వసతి గృహాలకు వస్తున్నారు. వారికి సరైన సదుపాయాలు కల్పించాలి. నాణ్యతతో కూడిన మంచి భోజనాన్ని అందించాలి. దీంతో వారు ఉన్నతంగా చదివేందుకు వీలుంటుంది.

– టీ మాంతయ్య, మంచిర్యాల

ఉపాధి అవకాశం కల్పించాలి



ఏటా వేలాదిమంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగం, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగావకాశాలు అందరికీ రావడం కష్టమే. కానీ.. ఉద్యోగాలు రానివారు వారి కాళ్లపై వారు జీవించేందుకు అవసరమైన ఉపాధి అవకాశాలు కల్పించాలి. అలాంటి పార్టీకే మద్దతు ఇస్తాం.

– బీ సంతోష్, మంచిర్యాల


నాణ్యమైన విద్య అందించాలి



కేజీ నుంచి పీజీ, ఇంజినీరింగ్, వైద్య విద్య ఇలా అన్ని రకాల నాణ్యమైన విద్యను అందించాలి. ఉన్నత చదువుల కోసం తగిన ప్రోత్సాహమివ్వాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. అన్ని వర్గాలవారికీ సమానంగా ఒకే రకమైన విద్య అందించిన పార్టీకే మా మద్దతు ఉంటుంది.

– బీ మౌనిక, సీతారాంపల్లి, నస్పూర్

నోటిఫికేషన్లు వేయాలి



నిరుద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూసే ఉద్యోగ నోటిఫికేషన్లు సకాలంలో వేయాలి. ఎంతోమంది ఉద్యోగం సాధించాలని వేలాది రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ కేంద్రాలకు వెళ్తున్నారు. దరఖాస్తు చేసి, పరీక్ష రాసిన తర్వాత వెంటనే ఫలితాలు వెల్లడించి ఉద్యోగాలు భర్తీ చేయాలి.

– ఏలేశ్వరం గౌతం, లక్సెట్టిపేట

క్లుప్తంగా

ఆసిఫాబాద్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా నరేందర్


నరేందర్

మంచిర్యాలటౌన్: ఐఎన్టీయూసీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాలకు చెందిన రాంశెట్టి నరేందర్‌ను ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు.

బీజేపీకి 'జాడి' రాజీనామా


రాజీనామా పత్రం చూపుతున్న ఏసయ్య

జైపూర్(చెన్నూర్): బీజేపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీపీ జాడీ ఏసయ్య ఆ పార్టీకి రాజీనామా చేశారు. మంగళవారం జైపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నప్పటికీ సముచితమైన స్థానం కల్పించలేదని, పార్టీ వ్యవహారాలు నచ్చకనే తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మద్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొరలబంగ్లాస్ ఏరియా వద్ద సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఏరియాలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై ఒకరు మద్యం బాటిళ్ల కాటన్‌తో వెళ్తూ కనిపించాడు. ఆపేందుకు ప్రయత్నిస్తుండగా బైక్ వదిలేసి పారిపోయాడు. పట్టుకున్న మద్యం విలువ రూ.16 వేలు ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. మందు బాటిళ్లను స్వాధీనం చేసుకుని బైక్ నంబర్ ఆధారంగా చిర్రకుంట సర్పంచ్ కొమురయ్యపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

బెల్లంపల్లి: పట్టణంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపారు. కూరగాయల మార్కెట్ ఏరియాలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా బంకర్ వద్ద షేక్ ఖలీల్ అనే వ్యక్తి గంజాయి దమ్ము కొడుతూ కనిపించాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా అతని వద్ద 135 గ్రాముల గంజాయి లభించింది. బల్లార్షా నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి ఇక్కడ అధిక ధరకు అమ్ముతున్నట్లు నిందితుడు అంగీకరించాడని ఎస్‌హెచ్‌వో తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



ఎన్నికల ప్రక్రియలో వీరే కీలకం..

- బీఎల్‌వో నుంచి జిల్లా ఎన్నికల అధికారి వరకు
- ఓటరు జాబితా తయారీ మొదలు ఫలితాల వరకు

జంగ్ తెలంగాణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల నిర్వహణలో బీఎల్‌వో నుంచి మొదలు జిల్లా ఎన్నిల అధికారి వరకు అంతా కీలకం. ఓటరు జాబితా మొదలు ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఈ అధికార యంత్రాంగం శ్రమ అంతాఇంతా కాదు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో మొత్తం ఈ అధికారులపాత్రే ఉంటుంది.

జిల్లా ఎన్నికల అధికారి..

కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులకు విధుల కేటాయింపు మొదలుకుని సిబ్బందికి శిక్షణ, ఎన్నికల కార్యక్రమాల పూర్తిస్థాయి పర్యవేక్షణ, నిత్యం సమీక్ష జరుపుతూ మార్గదర్శనం చేస్తారు. అంతేకాదు ఎన్నికల విధులు బాధ్యాతాయుతంగా, ప్రశాంత వాతావరణంలో సాగేలా పర్యవేక్షిస్తారు. మొత్తంగా ఓటరు జాబితా తయారీ నుంచి మొదలు ఓట్ల లెక్కింపు వరకు జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్‌దే పూర్తి బాధ్యత.

బీఎల్‌వోలు..

గ్రామ, పట్టణ స్థాయిల్లో పనిచేసే వారు బీఎల్‌వో (బూత్ స్థాయి అధికారి)లు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడంతోపాటు ఓటరు జాబితాలో పేరు నమోదు, తప్పులు, సవరణ, మార్పులు, చేర్పులు, తొలగింపులు.. ఇలా అన్ని బాధ్యతలు బీఎల్‌వోలు నిర్వర్తిస్తారు. ఓటరు జాబితా తయారీలో అధికారుల సహాయంతో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవకతవకలు లేని ఓటరు జాబితా తయారీలో కీలకంగా వ్యవహరిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి..

ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి (పీవో) ఉంటారు. పోలింగ్ ప్రక్రియకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి సమకూర్చే బాధ్యత పీవోకు ఉంటుంది. ఆ కేంద్రం పూర్తి బాధ్యత ప్రిసైడింగ్ అధికారిదే. ఓటింగ్ ముగిసిన తర్వాత కూడా యంత్రాలను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంలకు తరలించే వరకు పర్యవేక్షిస్తారు. వీరికి అదనపు ప్రిసైడింగ్ అధికారి సహాయంగా ఉంటారు. వీరితో పాటు మరో ముగ్గురు పోలింగ్ అధికారులు కూడా ఉంటారు. వీరంతా ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరును చూడాల్సిన బాధ్యత వీరిదే.

రిటర్నింగ్ అధికారి..

ప్రతీ నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి(ఆర్‌వో) ఉంటారు. ఎన్నికల సంఘం వీరిని నియమిస్తుంది. వీరు ఆ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ మొదలు నామినేషన్ పరిశీలన, తిరస్కరణ, అభ్యంతరాలు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన అంతా వీరి చేతుల్లో ఉంటుంది. ఇక ఎన్నికల సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు అంతా వీరు చూస్తారు.

సెక్టోరియల్ అధికారి..

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించడంలో సెక్టోరియల్ అధికారి పాత్ర ఉంటుంది. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేయడం, విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనలో ముఖ్యపాత్ర పోషిస్తారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు కేటాయిస్తారు. పోలింగ్ కేంద్రంతో పాటు పోలింగ్ జరిగే పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూస్తారు. పోలింగ్ సమయాల్లో ఆయన పర్యవేక్షించే పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా సెక్టోరియల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ప్రభుత్వ భూమి దురాక్రమణ

- పట్టించుకోని అధికారులు


అక్రమార్కులు చదును చేసిన ప్రభుత్వ భూమి

బెల్లంపల్లి: పట్టణంలో భూకబ్జాల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిని ఆక్రమించేస్తున్నారు. బెల్లంపల్లి నుంచి గురిజాలకు వెళ్లే మార్గంలో ఐటీడీఏ ఉద్యానవన శాఖ ముందున్న ప్రభుత్వ స్థలం రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు కబ్జాకు సిద్ధం చేశారు. ప్రధాన రహదారిని ఆనుకుని స్మశాన వాటిక పక్కనున్న అరెకరం స్థలాన్ని కబ్జా రాయుళ్లు ఆక్రమించుకున్నారు. బెల్లంపల్లి మండలం బుధాకలాన్ శివారు సర్వే నంబర్ 170లో ఉన్న విలువైన భూమిని ఆక్రమించుకోవడం చర్చనీయాంశంగా మారింది.

రాత్రి చదును చేసి.. ముళ్ల కంచె వేసి..

కబ్జా అయిన భూమిని రాత్రికి రాత్రే ట్రాక్టర్‌తో దున్నించి చదును చేయించి అడ్డంగా ముళ్ల కంపవేశారు. ఆక్రమిత భూమి పక్కన కూతవేటు దూరంలో నేతకాని, మన్నెవార్, కొలవార్ సంఘాల భవనాలకు కేటాయించిన భూమి ఉంది. ఆపక్కనే ఉన్న ఖాళీ స్థలాలన్నీ అక్రమార్కులు కబ్జా చేశారు.

దృష్టి సారించని అధికారులు

ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురికాకుండా చూడాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. అంతేకాకుండా ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు భూకబ్జాకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రూ.3.75 లక్షల నగదు స్వాధీనం


నగదు అప్పగిస్తున్న ఎస్‌హెచ్‌వో బన్సీలాల్

బెల్లంపల్లి: నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకెళ్తున్న ఇరువురి వద్ద నుంచి రూ.3.75 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. మంగళవారం కన్నాల హైవే చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కన్నాల బస్తీకి చెందిన తెల్ల సతీష్ రూ.1.75 లక్షలు, ఇంక్‌లైన్ బస్తీకి చెందిన గొట్టే రాజనర్సు రూ.2 లక్షల నగదు తీసుకెళ్తూ పట్టుబడ్డారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ టీమ్ అధికారి సురేఖకు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో ప్రకటించారు.

యువకుడు ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఖర్జవెల్లి గ్రామానికి చెందిన ఎల్కరి తిరుపతి (25) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులకు విషయం తెలపడంతో సిర్పూర్(టి) సివిల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

దరఖాస్తుల స్వీకరణ

శ్రీరాంపూర్: వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి మంచిర్యాల జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అందించే ప్రతిభా పురస్కారాల అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ మంచిర్యాల రీజియన్ అధ్యక్షుడు ఆర్ముల్ల రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరంలో సామాజిక సేవారంగం, క్రీడారంగం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ, పట్టణ అభివృద్ధి, సాహిత్యం, రచనలు, కవులు, కళాకారులకు, విద్యా వైద్యం రాజకీయ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డులు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారు ఈ నెల 30లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్(చెన్నూర్): పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో సులభ్ కాంప్లెక్స్ పక్కనున్న గండికోట రవికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి సమీపంలోని చెత్తను తగులబెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పంటుకుంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పూర్తిగా దగ్ధమైంది. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగినట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు రూ.పదివేలు, బీఆర్‌ఎస్ నాయకులు రూ.20 వేలు సాయం అందించారు.

'అకడమిక్ ఎక్సలెన్స్ కాంక్లేవ్ విజయవంతం చేయాలి'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ జేవియర్ రెక్స్

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పట్టణంలోని కార్మెల్ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న అకడమిక్ ఎక్సలెన్స్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మెల్ అకాడమీ డైరెక్టర్ జేవియర్ రెక్స్ కోరారు. మంగళవారం పాఠశాల ఆవరణలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మెల్ హైస్కూల్ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 40 పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పే...ద్ద సీతాకోక చిలుక

కెరమెరి: మనం ఇప్పటి వరకు చిన్నచిన్న సీతాకోక చిలుకలను మాత్రమే చూశాం. కానీ ఇక్కడ కనిపించే సీతాకోకచిలుక ఏకంగా పదించల పొడవు, నాలుగించుల వెడల్పు ఉంది. కెరమెరి మండల కేంద్రంలోని సద్గురు(విష్ణు) మెడికల్ షాపులో మంగళవారం రాత్రి ఎగురుతూ వచ్చింది. కౌంటర్‌పై ఉన్న గ్రీన్ గ్రాస్ మ్యాట్‌పై రెక్కలు విప్పి కూర్చుని ఏకంగా 12 గుడ్లను వేసింది. గోధుమరంగులో ఉన్న ఈ సీతాకోక చిలుక రెక్కలు ఎంతో అందంగా ఉన్నాయి. రెక్కలపై ప్లస్ ఆకారంలో నల్లటి బొట్లు ఉన్నాయి. విషయం తెలుసుకున్న పట్టణవాసులు ఆసక్తిగా తిలకించారు.


సీతాకోకచిలుక గుడ్లు


సీతాకోక చిలుక

ఎమ్మెల్యే కోనప్పకు నిరసన సెగ

- ప్రచారాన్ని అడ్డుకున్న చిన్నగుడిపేట గ్రామస్తులు
- గత హామీలు అమలు చేయలేదని నిరసన


కోనప్పను అడ్డుకుంటున్న గ్రామస్తులు

భీమిని/దహెగాం: మంచిర్యాల జిల్లా భీమిని మండలం చిన్నగుడిపేట గ్రామానికి మంగళవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన సిర్పూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు నిరసన సెగ తగిలింది. గత ఎన్నికల్లో రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు వేయించలేదని గ్రామస్తులు రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు బైక్‌లను తొలగించినప్పటికీ ప్రచారం చేయకుండా గ్రామస్తులు అడ్డుపడడంతో కోనప్ప చేసేదేంలేక అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. గ్రామంలోని పలువురు యువకులు వీడియో తీస్తుండగా ఎమ్మెల్యే గన్‌మెన్‌లు సెల్‌ఫోన్‌లు లాక్కుని వీడియోలు డిలీట్ చేశారు.

అభివృద్ధిలో వెనుకబడిన గ్రామాలు

భీమిని(బెల్లంపల్లి): జిల్లాలు, మండలాల విభజనతో సిర్పూర్ నియోజకవర్గం నుంచి కొన్ని గ్రామాలు బెల్లంపల్లి నియోజకవర్గంలోని భీమిని మండలంలో విలీనమయ్యాయి. భీమిని మండలంలోని చిన్నగుడిపేటలో 1319 మంది ఓటర్లు ఉండగా, కేస్లాపూర్‌లో 859, చిన్నతిమ్మాపూర్‌లో 561, కన్నెపల్లి మండలంలోని సాలిగాంలో 560, మాడవెల్లిలో 730 మంది ఓటర్లు కలిగిన గ్రామాలు విలీనమయ్యాయి. దీంతో పరిపాలన పరంగా బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి జరుగుతుండగా ఆయా గ్రామాల ప్రజలు ఓట్లు మాత్రం సిర్పూర్ నియోజకవర్గానికి వేయాల్సి వస్తోంది. దీంతో రెండు నియోజకవర్గాల మధ్య గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదు. గ్రామాల్లో ప్రధానంగా రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాలు లేవంటూ ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు ఏ అధికారికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందని వాపోతున్నారు. నియోజకవర్గాల విభజన జరిగితే తప్పా ఆయా గ్రామాల ప్రజల సమస్య తీరేలా లేదు.

11వ వేతన ఒప్పందాలపై ఉత్తర్వులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గుగని కార్మికులకు సంబంధించిన 11వ వేతన ఒప్పందం అమలుకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొందని ఏఐటీయూసీ వేజ్‌బోర్డు కమిటీ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఢిల్లీలో జేబీసీసీఐ స్టాండడైజేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో వేజ్‌బోర్డులో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎల్టీసీ, ఎల్ఎల్‌టీసీ, లీవులకు సంబంధించి ఒప్పందాలను అమలు చేయడానికి ఉత్తర్వులను విడుదల చేస్తామని యజమాన్యం ఒప్పుకుందన్నారు. అంతేకాకుండా కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు పెంచడానికి కమిటీ ఏర్పాటు చేస్తారన్నారు. కార్మికులకు వైద్యానికి సంబంధించిన సీపీఆర్ఎంఎస్ అమలు, లోపాల సవరణ కోసం కమిటీ ఏర్పాటు చేయడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు, మిగులు క్వార్టర్లను కార్మికులకు అమలు చేయడం అంశంపై చర్చించడానికి కూడా కమిటీ ఏర్పాటుకు యజమాన్యం అంగీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సిర్పూర్(టి): ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్ని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కాగజ్‌నగర్ జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పేట్‌మహెలా కాలనీకి చెందిన పత్తి శంకర్ (57) మంగళవారం ఉదయం వాకింగ్ చేసేందుకు రైల్వేస్టేషన్ ప్రాంతానికి వచ్చాడు. రైలుపట్టాలు దాటి బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని భార్య పత్తి పుష్పలతకు మృతదేహం అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాసిపేట(బెల్లంపల్లి): ఈ నెల 15, 16 తేదీలలో హైదరాబాద్‌లోని సీసీఆర్టీలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీలకు మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరస్వామి తెలిపారు. టాయ్స్ అండ్ గేమ్స్ బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని బిందుప్రియ, బాలుర విభాగంలో 9వ తరగతికి చెందిన జి.నరేందర్, సాంప్రదాయ ఇన్స్ట్రుమెంటల్ బాలికల విభాగంలో పదో తరగతికి చెందిన అఖిల, సోలో డ్రామా బాలుర విభాగంలో 9వ తరగతికి చెందిన శివకుమార్ ఎంపికయ్యారు. ఈనెల 9న మంచిర్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు, గైడ్ టీచర్‌ను ఎంఈవో ప్రభాకర్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

వేతన బకాయిలు ఇప్పించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: తమకు వేతన బకాయిలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ శాలీవాహన పవర్ ప్లాంట్ కార్మికులు మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ శాలీవాహన గ్రీన్ ఎనర్జీ బయోమాస్ విద్యుత్ ప్లాంట్ గతేడాది డిసెంబర్ 6న మూసివేసిన యాజమాన్యం అప్పటి నుంచి కార్మికులకు రావాల్సిన ప్లాంట్ క్లోజింగ్ బెనిఫిట్స్ ఇవ్వలేదన్నారు. ప్లాంట్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాలు ఫ్రీజింగ్‌లో ఉన్నాయని ఫ్రీజింగ్ ఎత్తేసిన తర్వాత కార్మికులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్‌లు ఇస్తామని యాజమాన్యం రాతపూర్వకంగా రాసి ఇచ్చిందన్నారు. బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్ ఎత్తేసిన తర్వాత కార్మికులకు సమాచారం ఇవ్వకుండానే యాజమాన్యం డబ్బులు డ్రా చేసి వాడుకుందన్నారు. కార్మికులకు రావాల్సిన ప్లాంట్ క్లోజింగ్ బెనిఫిట్స్ ఇచ్చిన తర్వాతే స్క్రాప్, మెషినరీ తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దూరి రాజుయాదవ్, కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్, నిమ్మరాజుల సత్యనారాయణ, సగ్గుర్తి ఆనందరావు, రావుల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ, సీఐలు

కాసిపేట/కోటపల్లి/వేమనపల్లి: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ముత్యంపల్లి, కాసిపేటలో పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి కాసిపేట వరకు నిర్వహించిన కార్యక్రమంలో 70మంది పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ ఉమెన్ బెటాలియన్ ఫోర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో ఎంఏ అలీం, కాసిపేట, దేవాపూర్ ఎస్సైలు గంగారాం, ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో..

కోటపల్లి మండల కేంద్రం, వేమనపల్లి మండలం నీల్వాయిలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ మోహన్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ రూరల్, టౌన్ సీఐలు విద్యాసాగర్, వాసుదేవరావు, ఎస్సైలు సుబ్బారావు, సురేష్, పాల్గొన్నారు.

పోలీసులపై దాడి కేసులో నిందితులకు జైలు

లక్ష్మణచాంద(నిర్మల్): పోలీసులపై దాడి కేసులో ఇద్దరు నిందితులకు మూడు నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సత్రియా నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్మణచాంద గ్రామంలోని వైన్‌షాప్ వద్ద 2016 ఏప్రిల్ 14న ఇదే గ్రామానికి చెందిన పత్తిపాక గంగన్న, ఎద్దండి ముత్తన్న మద్యం కొనుగోలు చేశారు. మద్యం విక్రయించిన దిలీప్‌తో వాగ్వాదానికి దిగగా.. అతడు పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో అప్పటి హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్‌గౌడ్, కానిస్టేబుల్ గంగయ్య అక్కడికి వెళ్లి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నిందితులు పోలీసులపై దాడి చేసి దూషించారు. పోలీసుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మహేందర్ కేసు నమోదు చేశారు. ఏపీపీవో జి.రామకృష్ణ తొమ్మిది మందిని సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో న్యాయమూర్తి నిందితులు గంగన్న, ముత్తన్నలకు మూడు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.